జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 17 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 5

# యువ ఆపదమిత్రుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్

- ప్రాణ ,ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో ఆపద మిత్రుల పాత్ర ఎంతో కీలకం
- జిల్లా కలెక్టర్



కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 16 ,(ప్రజా జ్యోతి ) విపత్తులు సంభవించిన సమయంలో తక్షణమే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాన్ని

మిగతా 2 లో...

# రేగళ్లలో ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



- మెనూ నిర్లక్ష్యంపై వార్డెన్‌కు షోకాజ్ నోటీసు
- పనిచేయని ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టాలి

కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 16,(ప్రజా జ్యోతి ) లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల తండాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ అపరిశుభ్రతతో పాటు చెత్త ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని ఎన్‌సీసీ కార్యాలయాన్ని పరిశీలించారు, ఎన్‌సీసీలో ఉన్న విద్యార్థుల సంఖ్య, గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తదితర వివరాలను ఉపాధ్యాయులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు, కిచెన్‌లోని ఆర్వో వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్, అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టి ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కాసేపు మాట్లాడారు, విద్యార్థులకు వడ్డిస్తున్న

మిగతా 2 లో...

# నా బాధను ఎవరూ.. పట్టించుకోలేదు..





2 లో..

- నా చావుతో అయినా వాడికి తగిన శిక్ష అనుభవించేలా చేయాలి..!
- అక్షిత రాణి మరణ నోట్‌లో సంచలన ఆరోపణలు
- జీడీకే-2 ఇంక్లైన్‌లో శిక్షణకు వెళ్లిన సమయంలోనే ఘటన
- ఏప్రిల్ 8న ఫిర్యాదు.. తప్పుడు ఆరోపణగా మూసివేశారంటూ నోట్‌లో ఆవేదన
- దీంతో సింగరేణిలో మహిళా భద్రతపై ప్రశ్నలు..
- చివరి ప్రెస్ నోట్ తో సంబంధం లేకుండా.. కేసు నమోదు
- పోలీసుల ప్రెస్‌నోట్‌లో మాత్రం ఏ1గా జెట్టి నవీన్.. ఏ2గా రవికుమార్

"నా పేరు తాండ్ర అక్షిత రాణి డాటర్ ఆఫ్ తాండ్ర ఐజాక్ నేను గోదావరిఖనిలో ఉంటాను. నేను ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాను. నేను ట్రైనింగ్ కోసం జీడికే 2 ఇంక్లైన్లో వెళ్లాను. అక్కడ బొమ్మకంటి రవికుమార్ అనే ఓవర్ మాన్ నాతో అత్యాచారం చేశాడు. ఈ విషయం జిఎం ఆఫీస్, మైన్ దగ్గర కంప్లైంట్ చేసిన కూడా నా బాధ ఎవరు పట్టించుకోలేదు. తప్పుడు ఆరోపణ అని నా కంప్లైంట్ క్లోజ్ చేశారు. ఈ మానసిక క్షోభ తట్టుకోలేక నేను ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నాను. నా ఈ చావుతో అయినా వాడికి తగిన శిక్ష అనుభవించేలా చేయాలి.." అక్షిత రాణి మరణానికి ముందు రాసినట్లు ఉన్న నోట్‌లోని ఈ మాటలు ఇప్పుడు పలువురిని కలిసి వేయడంతోపాటు సింగరేణి వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. దీంతో సాధారణంగా ఒక ఫిర్యాదు చేసి న్యాయం కోసం ఎదురుచూసిన యువతి.. చివరకు తన ఆవేదనను నోట్‌లో రాసి ప్రాణాలు తీసుకున్న పరిస్థితి ఏంటి? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఇక ఈ అంశం తో సింగరేణిలో మహిళ భద్రతపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- భద్రాద్రి కొత్తగూడెం / సింగరేణి ప్రతినిధి, ప్రజాజ్యోతి

# స్టేషన్‌కు తీసుకెళ్తానని చెప్పి.. రూ.3 వేలు తీసుకుని వదిలేశారా?



(ఏ ఐ చిత్రం)

- మట్టి ట్రాక్టర్ విషయంలో కానిస్టేబుల్ చేతివాటం..
- మంగపేట ఓవర్‌బ్రిడ్జి వద్ద డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలు
- పోలీసుల వివరణ కోరగా.. అలాంటిదేమీ జరగలేదన్న ఎస్‌హెచ్‌ఓ కల్యాణి

సుజాతనగర్, సెప్టెంబర్ 16, ప్రజా జ్యోతి : అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తానంటూ ఓ కానిస్టేబుల్ అడ్డుకుని, మార్గమధ్యలో రూ.3 వేల నగదు తీసుకుని వదిలేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుజాతనగర్ మండలం సర్వారం పరిధిలో మట్టి తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను కానిస్టేబుల్ పట్టుకున్నట్లు సమాచారం. అనుమతులు లేవంటూ స్టేషన్‌కు తీసుకెళ్తానని చెప్పి మంగపేట సమీపంలోని రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడ ట్రాక్టర్ యజమానితో మాట్లాడిన అనంతరం రూ.3 వేలు తీసుకుని ట్రాక్టర్‌ను వదిలేశారన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే ఈ ఆరోపణలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై సుజాతనగర్ ఎస్‌హెచ్‌ఓ కల్యాణిని వివరణ కోరగా.. డబ్బులు తీసుకుని వదిలేసినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని తెలిపారు. ఓ ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్న విషయం వాస్తవమేనని, తనిఖీ చేయగా సంబంధిత అనుమతులు ఉన్నట్లు తేలడంతో వదిలేశామని స్పష్టం చేశారు. దీంతో రూ.3 వేల నగదు తీసుకున్నారన్న ఆరోపణలపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

# మావోయిస్టుల డంప్ గుర్తింపు

- ఆయుధాలు, పేలుడు పదార్థాలు, పనిముట్లు స్వాధీనం



చర్ల, సెప్టెంబర్ 16: (ప్రజా జ్యోతి ): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఫర్సేగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బదేల్‌వాడ గ్రామ సమీపంలోని అటవీ–కొండ ప్రాంతంలో మావోయిస్టులు దాచినట్లు అనుమానిస్తున్న ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫర్సేగఢ్ పోలీస్ స్టేషన్

మిగతా 2 లో...

## రేగళ్లలో ఆశ్రమ పాఠశాలను ఆకస్మి కంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



(మొదటి పేజీ తరువాయి...)

ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం మెనూలో చికెన్ అందించాల్సి ఉన్నప్పటికీ విద్యార్థులకు వడ్డించిన భోజనంలో చికెన్ లేకపోవడాన్ని కలెక్టర్ గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందించడంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేస్తూ, సంబంధిత వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం విషయంలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు . ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల డంప్ గుర్తింపు


(మొదటి పేజీ తరువాయి...)

డీఆర్‌జీ బీజాపూర్, బీడీఎస్ బృందాలు సంయుక్తంగా చేపట్టిన గాలింపు చర్యల్లో ఈ సామగ్రి బయటపడింది.మంగళవారం ఒక వ్యక్తి నుండి అందిన సమాచారంతో బీజాపూర్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు సంయుక్త బృందాలు బదేల్‌వాడ అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా మావోయిస్టులు దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాలను గుర్తించారు. అనంతరం బీడీఎస్ బృందం అవసరమైన భద్రతా చర్యలు, మైన్ నిర్మూలన చర్యలు చేపట్టి సామగ్రిని సురక్షితంగా స్వాధీనం చేసుకుంది.స్వాధీనం చేసుకున్న వాటిలో ఒక 315 బోర్ నాటు తుపాకీ, 315 బోర్ లైవ్ రౌండ్లు 49, 303 రైఫిల్ లైవ్ రౌండ్లు 25, 12 బోర్ లైవ్ కార్ట్రిడ్జ్‌లు 34, 303 రైఫిల్ బట్ ప్లేట్, బోల్ట్, ఖాళీ మ్యాగజైన్, ఇతర రైఫిల్ భాగాలు ఉన్నాయి. అలాగే 8 కిలోల జిలాటిన్, ఛార్జర్లతో కూడిన ఆరు వాకీటాకీ సెట్లు, ఒక మెయిన్ ప్యాక్ సెట్, వివిధ రకాల ఎలక్ట్రానిక్, రాగి వైర్లు, డిటోనేటర్ వైర్, క్లచ్ వైర్, బ్యాటరీలు, సెల్స్, స్విచ్‌లు, సాకెట్లు, ఇతర పేలుడు సామగ్రి, పనిముట్లు స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, పేలుడు పదార్థాలను బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 106 కింద జప్తు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## యువ ఆపదమిత్రల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్

(మొదటి పేజీ తరువాయి...)

తగ్గించడంలో ఆపదమిత్రలు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. లక్ష్మీదేవి పల్లి మండలం చాతకొండ ఆరవ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్ ఆధ్వర్యంలో యువ ఆపదమిత్రల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భౌగోళిక, వాతావరణ పరిస్థితుల వైవిధ్యం కారణంగా దేశంలో వివిధ రకాల విపత్తులు సంభవించే అవకాశం ఉందన్నారు.కొత్తగూడెం జిల్లాలో గోదావరి వరదలు, ఆకస్మిక వరదలు, పట్టణ ప్రాంతాల్లో నీటి ముంపు, అటవీ అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు తదితర విపత్తులు సంభవించే అవకాశం ఉన్నందున స్థానికంగా శిక్షణ పొందిన యువత అందుబాటులో ఉండటం ఎంతో అవసరమన్నారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు తక్షణ సహాయక చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చన్నారు. విపత్తుల సమయంలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక అప్రమత్తత, సమయస్ఫూర్తి, పరిస్థితిని వేగంగా అంచనా వేసే సామర్థ్యం, సరైన నిర్ణయం తీసుకునే నైపుణ్యం ఎంతో కీలకమని కలెక్టర్ తెలిపారు. అనంతరం 6 బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి. రమణ మాట్లాడుతూ విపత్తులు సంభవించిన తొలి కొన్ని నిమిషాలు అత్యంత కీలకమన్నారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు వేగంగా స్పందించి ప్రాథమిక సహాయక చర్యలు చేపట్టగలరన్నారు.అనంతరం కార్యక్రమంలో భాగంగా ఆపదమిత్రలకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా శిక్షణ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ శ్రీధర్ రాజా, అసిస్టెంట్ కమాండెంట్ మరియా దాస్, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, పోలీసు, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు, శిక్షకులు, ఆపదమిత్రలు తదితరులు పాల్గొన్నారు.





# నా బాధను ఎవరూ.. పట్టించుకోలేదు..

- నా చావుతో అయినా వాడికి తగిన శిక్ష అనుభవించేలా చేయాలి..!
- అక్షిత రాణి మరణ నోట్‌లో సంచలన ఆరోపణలు
- జీడీకే-2 ఇంక్లైన్‌లో శిక్షణకు వెళ్లిన సమయంలోనే ఘటన
- ఏప్రిల్ 8న ఫిర్యాదు.. తప్పడు ఆరోపణగా మూసివేశారంటూ నోట్‌లో ఆవేదన
- దీంతో సింగరేణిలో మహిళా భద్రతపై ప్రశ్నలు..
- చివరి ప్రెస్ నోట్ తో సంబంధం లేకుండా.. కేసు నమోదు
- పోలీసుల ప్రెస్‌నోట్‌లో మాత్రం ఏ1గా జెట్టి నవీన్.. ఏ2గా రవికుమార్

**"నా పేరు తాండ్ర అక్షిత రాణి డాటర్ ఆఫ్ తాండ్ర ఐజాక్ నేను గోదావరిఖనిలో ఉంటాను. నేను ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాను. నేను ట్రైనింగ్ కోసం జీడికే 2 ఇంక్లైన్లో వెళ్లాను. అక్కడ బొమ్మకంటి రవికుమార్ అనే ఓవర్ మాన్ నాతో అత్యాచారం చేశాడు. ఈ విషయం జిఎం ఆఫీస్, మైన్ దగ్గర కంప్లైంట్ చేసిన కూడా నా బాధ ఎవరు పట్టించుకోలేదు. తప్పడు ఆరోపణ అని నా కంప్లైంట్ క్లోజ్ చేశారు. ఈ మానసిక క్షోభ తట్టుకోలేక నేను ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నాను. నా ఈ చావుతో అయినా వాడికి తగిన శిక్ష అనుభవించేలా చేయాలి.." అక్షిత రాణి మరణానికి ముందు రాసినట్లు ఉన్న నోట్‌లోని ఈ మాటలు ఇప్పుడు పలువురిని కలిసి వేయడంతోపాటు సింగరేణి వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. దీంతో సాధారణంగా ఒక ఫిర్యాదు చేసి న్యాయం కోసం ఎదురుచూసిన యువతి.. చివరకు తన ఆవేదనను నోట్‌లో రాసి ప్రాణాలు తీసుకున్న పరిస్థితి ఏంటి? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఇక ఈ అంశం తో సింగరేణిలో మహిళ భద్రతపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.**

**● భద్రాద్రి కొత్తగూడెం / సింగరేణి ప్రతినిధి, ప్రజాజ్యోతి**

**శిక్షణ సమయంలోనే ఘటన?**

అక్షిత రాణి ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ చదువుతూ 12 రోజుల శిక్షణలో భాగంగా సింగరేణి ఆర్జీ–1 పరిధిలోని జీడీకే–2 ఇంక్లైన్‌కు వెళ్లింది. అక్కడ ఓవర్‌మ్యాన్‌గా పనిచేస్తున్న బొమ్మకంటి రవికుమార్ తనపై అత్యాచారం చేశాడని ఆమె నోట్‌లో ఆరోపించింది. ఘటన జరిగిన తర్వాత కూడా మౌనంగా ఉండకుండా సింగరేణి అధికారులను ఆశ్రయించినట్లు ఆమె రాత ద్వారా తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారంపై సుమారు ఐదు నెలల క్రిందట ఏప్రిల్ 8 నే ఆమె ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. జీఎం కార్యాలయం వద్ద ఫిర్యాదు చేసినా తన బాధను ఎవరూ పట్టించుకోలేదని అక్షిత చివరి నోట్‌లో పేర్కొంది. అంతేకాదు.. తన ఫిర్యాదును తప్పుడు ఆరోపణగా పేర్కొని మూసివేశారని కూడా ఆమె అందులో ఆవేదన వ్యక్తం చేసింది. అయితే అసలు ఏప్రిల్ 8న ఇచ్చిన ఫిర్యాదుపై ఏం జరిగింది? ఎవరు విచారణ చేశారు? ఎలాంటి ఆధారాలు పరిశీలించారు? ఫిర్యాదును మూసివేసిన నిర్ణయం ఎవరిది? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

**సెప్టెంబర్ 12న విషాదం..**

ఇక ఈ అంశంతో తీవ్ర ఆవేదనకు గురైన అక్షిత సెప్టెంబర్ 12న పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సెప్టెంబర్ 13న సాయంత్రం మృతి చెందింది. అయితే దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు మరో కొత్త కోణాన్ని తీసుకొచ్చారు. పోలీసులు విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో జెట్టి నవీన్‌ను ఏ1గా, బొమ్మకంటి రవికుమార్‌ను ఏ2గా పేర్కొంటూ.. ఇద్దరూ ప్రేమ పేరుతో అక్షితను వేధించినట్లు తల్లితండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. నవీన్ ఆమె చదివిన కళాశాలలో లెక్చరర్‌గా పని చేశాడని కూడా వెల్లడించారు. అయితే ఇక్కడే అసలు చిక్కు మొదలవుతోంది. అక్షిత రాసిన నోట్‌లో రవికుమార్‌పై అత్యాచారం ఆరోపణ ఉండగా..పోలీసుల ప్రెస్‌నోట్‌లో అదే అంశం "ప్రేమ పేరుతో వేధింపులు"గా ఎందుకు మారింది? అనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఆమె మరణ వాంగ్మూలంగా రాసిన ఓటు ఉండగా పోలీసు అధికారులు ఎందుకు తల్లిదండ్రుల దగ్గర నుండి ఫిర్యాదును స్వీకరించి ఆ వైపుగా ముందుకు సాగుతున్నారన్నదే.. ఇప్పుడు మిలియన్ డాలర్ల అనుమానాలను రేకెత్తిస్తుంది.

### సింగరేణిలో మహిళా భద్రతపై ఆందోళన

అక్షిత నోట్.. ఏప్రిల్ 8 నే ఫిర్యాదు.. పోలీసుల తాజా ప్రెస్‌నోట్ – ఈ మూడు అంశాలు కలిపి చూస్తే ఈ ఘటనలో మరిన్ని వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం కనిపిస్తోంది. అయితే అక్షిత రాణి నోట్‌లో సింగరేణి ఉద్యోగి రవికుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేయడంతో పాటు, తాను గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తన ఫిర్యాదును తప్పుడు ఆరోపణగా ఆర్ జి వన్ అధికారులు మూసివేశారని పేర్కొంది. దీంతో ఏప్రిల్ 8న చేసినట్లు చెబుతున్న ఫిర్యాదుపై జరిగిన విచారణ, తీసుకున్న చర్యలపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు పోలీసుల ప్రెస్‌నోట్‌లో జెట్టి నవీన్‌ను ఏ1గా, రవికుమార్‌ను ఏ2గా పేర్కొనడం కూడా చర్చనీయాంశమైంది. ఇక ఈ తాజా ఘటనతో సింగరేణిలో మహిళలు, అప్రెంటిస్‌ల భద్రతపై మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది. ఇకనైనా బాధితుల ఫిర్యాదులపై సకాలంలో స్పందన, సమగ్ర విచారణ, మహిళలకు భద్రత కల్పించే విషయంలో యాజమాన్యం మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. దీంతోపాటు ప్రస్తుతం ఈ ఘటనపై సింగరేణి యాజమాన్యం ఎలా స్పందిస్తుంది, ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది తేలాల్సి ఉంది.

## సర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలి...

**● భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్...**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. / మణుగూరు సెప్టెంబర్ 16, ప్రతినిధి** సర్ ప్రక్రియను సకాలంలోనే పూర్తి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ అధికారులకు ఆదేశించారు. బుధవారం సమితిసింగారం గ్రామ పంచాయతీలో జరుగుతున్న సర్ ప్రక్రియను ఐటీడీఏ పీఓ పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరణ పనులు ఎంతవరకు జరిగాయో అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి చేస్తున్న సర్వే వివరాలను పరిశీలించారు. సర్ ప్రక్రియకు ఎటువంటి పొరపాట్లు లేకుండా, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను నొక్కి చెప్పారు. ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, ఎలక్షన్ డీటీ, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్లకు సముచిత గౌరవం ఇవ్వాలి

- జెండా మోసింది మేము.. పదవులు దక్కేది ఎవరికీ?
- కార్యకర్తలను విస్మరించవద్దు
- పార్టీ పదవుల్లో సీనియర్లకు ప్రాధాన్యత కల్పించాలి



**చర్ల, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని కష్టకాలంలో పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తల మనోభావాలను పార్టీ అధిష్టానం గౌరవించాలని చర్ల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోరారు. పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు, ఇతర బాధ్యతల కేటాయింపులో పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.బుధవారం చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీనియర్ నాయకులు బండారు రామకృష్ణ, ఆవుల విజయ భాస్కర్ రెడ్డి, పటేల్ వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో సీనియర్ నాయకులు,కార్యకర్తల కృషి ఎంతో కీలకమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడిన వారి సేవలను గుర్తించి తగిన గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు లేదా ఇతర బాధ్యతలు కేటాయించే సమయంలో ముందుగా పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలకు అవకాశం కల్పించిన అనంతరం కొత్తగా పార్టీలో చేరిన వారికి అవకాశాలు ఇవ్వాలని కోరారు. భద్రాచలం నియోజకవర్గంలో పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పదవుల విషయంలో అసంతృప్తితో ఉన్నారని వారి మనోభావాలు దెబ్బతినడం పార్టీ భవిష్యత్తుకు మంచిది కాదన్నారు.2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని సమావేశంలో పలువురు అన్నారు . పార్టీ అధికారంలో లేని సమయంలో కూడా బీఆర్ఎస్ బెదిరింపులకు భయపడకుండా సొంత ఖర్చులతో గ్రామ గ్రామాన తిరుగుతూ పార్టీ కోసం పని చేశామని తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు తగిన గుర్తింపు, గౌరవం లభించకపోవడం బాధాకరంగా ఉందన్నారు.ఒక సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త తన ఆవేదనను వ్యక్తం చేస్తూ ఎన్నికల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగామని పార్టీ కోసం కష్టపడినప్పటికీ సీనియర్ పదవి నుంచి కూడా తొలగించారని అన్నారు . పార్టీ కోసం ఇన్నేళ్లు పని చేసిన తమలాంటి సీనియర్ నాయకుల కుటుంబాలకు కనీసం సంక్షేమ పథకాల విషయంలో కూడా తగిన గుర్తింపు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. "జెండా మోసింది మేము.. ఫలితం అనుభవిస్తున్నది ఎవరు?" అని సీనియర్ కార్యకర్తలు ప్రశ్నించారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకుని పనిచేసిన నాయకులు, కార్యకర్తలను విస్మరించకుండా వారి సేవలను గుర్తించాలని కోరారు. పార్టీ కోసం గ్రామస్థాయి నుంచి పనిచేసిన వారికి సముచిత గౌరవం,గుర్తింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.భద్రాచలం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకత్వం, ఎమ్మెల్యే చర్ల మండలంలో పార్టీ కోసం నిజంగా పని చేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను గుర్తించాలని వారు కోరారు. అర్హులైన వారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించడంతో పాటు, అర్హత ఉన్న కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాల్లో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని చర్ల మండలంలో కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తేనే పార్టీ మరింత బలోపేతమవుతుందని సీనియర్ నాయకులు తెలిపారు.

## గణనాథుడిని దర్శించిన ఎమ్మెల్యే వెంకట్రావు



**చర్ల, సెప్టెంబర్ 16: (ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలోని గణేష్ నగర్‌లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపంలో అర్చకులు విశ్వనాథ శర్మ ఎమ్మెల్యేతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు.అంతకుముందు గణేష్ నగర్ ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, చీమలమర్రి మురళి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు, కొసరాజు రాజా, పోలిన లంకరాజు, ముమ్మనేని అరవింద్, పొట్రు బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## నీట్‌లో సత్తా చాటి వైద్య విద్యలో సీటు సాధించిన కొట్టెం సహస్ర



**ఆళ్ళపల్లి, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్ళపల్లి మండలం తునికిబండల గ్రామానికి చెందిన కొట్టెం రాజమల్లు–చంద్రమ్మ (గ్రామ మాజీ పటేల్) దంపతుల మనవరాలు కొట్టెం సహస్ర వైద్య ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి వైద్య విద్యలో సీటు సాధించారు.2026లో నిర్వహించిన జాతీయ వైద్య ప్రవేశ పరీక్షలో 410 మార్కులు సాధించి, అఖిల భారత స్థాయిలో 2,49,312వ ర్యాంకు పొందారు. ఆమె ప్రతిభను గుర్తించిన కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్ర వైద్య విద్య ప్రవేశాల రెండో దశ కౌన్సెలింగ్‌లో వరంగల్‌లోని వైద్య కళాశాలలో వైద్య విద్య సీటు కేటాయించింది.సహస్ర వైద్య విద్యలో సీటు సాధించడంపై కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య శిబిరం





**చర్ల, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని ఉంజుపల్లి ఆశ్రమ పాఠశాలలో బుధవారం చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 86 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ విద్యార్థులంతా ఆరోగ్యంగానే ఉన్నారని, కొందరు స్వల్ప చర్మ సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి మందులు అందించినట్లు తెలిపారు. విద్యార్థులు ఒకరి దుస్తు లు మరొకరు ధరించకూడదని, ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా స్నానం చేయాలని సూచించారు. బట్టలను పూర్తిగా ఆరిన తర్వాతే ధరించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ కాళ్లు, చేతులు కప్పే వదులైన దుస్తులు ధరించాలని, అందుబాటులో ఉంటే దోమతెరలను వినియోగించాలని సూచించారు.అనంతరం పాఠశాల పరిసరాలు, వంటశాల, స్టోర్‌రూమ్, బాత్‌రూమ్‌లను పరిశీలించిన డాక్టర్ హారిక సిబ్బందికి పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి పలు సూచనలు చేశారు. హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ తులసి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డుకు శ్రీకారం

- ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండలం కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. జీసీసీ స్టోర్ బజార్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ తాటి వాణి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డు పనులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు.ఎస్సీ కాలనీలో రోడ్డు సౌకర్యం మెరుగుపడటంతో స్థానిక ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తొలగనున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మారడం, గుంతలు ఏర్పడటం తదితర సమస్యల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం లభించనుంది.కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తాటి వాణి తెలిపారు.గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆమె పేర్కొన్నారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా చేపడుతూ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూక్యా మోహన్ రావు, ఎంపీడీవో జమాలరెడ్డి, పీఆర్ఏఈ చారి,పంచాయతీ కార్యదర్శి ఎం. నాగిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రం సురేష్, వార్డు సభ్యులు ఉసిల్ల రాజేష్, అంతోటి కృష్ణలీల, పద్దం రాజు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా అన్న ప్రసాద కార్యక్రమం





**గుండాల సెప్టెంబర్ 16 ప్రజా జ్యోతి** గణేష్ నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంలోని సుభాష్ నగర్ లో అన్న ప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు బుధవారం. గణేష్ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద మూడో రోజు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని సుభాష్ నగర్ లో వినాయక నవరాత్రుల సందర్భంగా అన్నప్రసాద కార్యక్రమాన్ని గడ్డం రాంబాబు సుజాత దంపతులు ముందుకు వచ్చి తమ అన్న ప్రసాద కార్యక్రమాన్ని అందిస్తామని తెలపడంతో గణేష్ మండలి కమిటీ సభ్యులు ఘనంగా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన గడ్డం రాంబాబు సుజాతలకు గణేష్ మండలి సభ్యులు అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో గుండాల ఎస్సై శ్రావణ్ కుమార్, తిరు కొల్లూరి వెంకటేశ్వర్లు, మానాల ప్రభాకర్, మానాల ప్రణీత్ యువకులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా క్రీడా పోటీలు



**ఆళ్ళపల్లి,సెప్టెంబర్16(ప్రజా జ్యోతి)** ఆళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాధికారి కొమరం శాంతారావు ఆధ్వర్యంలో క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ వాసం సుస్మిత, ఉప సర్పంచ్ సయ్యద్ ఆరిఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతో పా టు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని వారు సూచించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, శైలజ, అశోక్. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమరం శాంతారావు, ఉపాధ్యాయులు వీరన్న (ఇంగ్లిష్), బాలాజీ (బయాలజీ), వెంకటేశ్వర్లు (మ్యాథ్స్), కోటేశ్వరమ్మ (ఫిజిక్స్), వీరన్న (హిందీ), వీరన్న (తెలుగు) సమ్మయ్య (సోషల్), ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐటీఐ యువతకు ఉద్యోగావకాశాలు

- 18న అప్రెంటిస్ షిప్ మేళా




**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి):** మండలంలోని కృష్ణసాగర్ ప్రభుత్వ ఆర్ ఐటీఐలో ఈ నెల 18న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటి స్ షిప్ మేళాను నిర్వహించనున్నట్లు ఆర్ ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాకు వివిధ ప్రముఖ పరిశ్రమలు, సంస్థలు హాజరై అర్హులైన ఐటీఐ ఉత్తీర్ణులను అప్రెంటిస్ షిప్ అవకాశాల కోసం ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.ఐటీఐలో వివిధ ట్రేడుల్లో శిక్షణ పూర్తి చేసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. అప్రెంటిస్ షిప్ కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా apprenticeshipindia.in వెబ్ సైట్ లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం బయోడేటా, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, అవసరమైన ఇతర పత్రాలతో ఈ నెల 18న కృష్ణసాగర్ ప్రభుత్వ ఆర్ ఐటీఐలో జరిగే మేళాకు హాజరుకావాలని సూచించారు.ఈ అప్రెంటిస్ షిప్ మేళాలో ఐటీసీ పేపర్ బోర్డు, ఫిమాకెం,మహీంద్రా అండ్ మహీంద్రా,మేధా సర్వో డ్రైవ్,డైనమిక్ టూల్స్ తదితర ప్రముఖ సంస్థలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఆయా సంస్థల్లో అప్రెంటిస్ షిప్ శిక్షణ పొందేందుకు అర్హత ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఐటీఐ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మెరుగుపరుచుకునేందుకు అప్రెంటిస్ షిప్ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.శిక్షణతో పాటు పరిశ్రమల్లో పని అనుభవం పొందే అవకాశం ఉండటంతో భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని పేర్కొన్నారు. అర్హత ఉన్న యువత పెద్ద సంఖ్యలో మేళాకు హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు కోరారు.

# అంబేద్కర్ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రచారంపై చర్యలు తీసుకోవాలి



**బూర్గంపహాడ్, సెప్టెంబరు 16 (ప్రజా జ్యోతి ):** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై దురుద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంబేద్కర్‌ను కించపరిచేలా, ఆయన చరిత్రను వక్రీకరించే విధంగా కల్పిత విషయాలతో పుస్తకాన్ని ప్రచురించారని ఆరోపిస్తూ జాతీయ మాల మహానాడు నాయకులు పోలీసులను ఆశ్రయించారు.జాతీయ మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు పల్లంటి రమేష్, కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, జాతీయ మాల మహానాడు రాష్ట్ర సీనియర్ నాయకుడు కూరపాటి దాస్ బుధవారం బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్‌కు ఫిర్యాదు అందజేశారు. అంబేద్కర్ ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో అసత్య, అభ్యంతరకర అంశాలను ప్రచారం చేస్తూ పుస్తకం ప్రచురించిన అమర ప్రసాద్‌పై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్రను వక్రీకరించేలా ప్రచారం చేయడం సమాజంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.అంబేద్కర్‌ను కల్పిత నాయకుడిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తూ పుస్తకాన్ని ప్రచురించడం వెనుక ఉన్న ఉద్దేశాలను కూడా పరిశీలించాలని పోలీసులను కోరారు. ఇలాంటి ప్రచారం వల్ల ప్రజల్లో అపోహలు, అపార్థాలు ఏర్పడటంతో పాటు సామాజిక వర్గాల మధ్య విభేదాలు తలెత్తే అవకాశం ఉందని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.అంబేద్కర్ వంటి జాతీయ నాయకుల చరిత్రపై ఆధారాలు లేని ప్రచారం జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు సంబంధిత అంశాలను పరిశీలిస్తామని తెలిపారు.

# ఈశ్వర్ గణేష్ మహల్‌లో ఘనంగా గరిక పూజ

- భక్తులను ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు
- లక్కీ డ్రాలో మహిళా భక్తులకు చీరల బహూకరణ



**పాల్వంచ, సెప్టెంబర్ 16, ప్రజాజ్యోతి:** వర్తక సంఘం ఆధ్వర్యంలో ఈశ్వర్ గణేష్ మహల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం విఘ్నేశ్వర స్వామివారికి సామూహిక గరిక పూజ, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పూజ్యశ్రీ వీరభద్రం గురువు గారు భక్తులకు విశేష ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు. అనంతరం వేద పండితులు నాని శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా గరిక పూజ నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

**లక్కీ డ్రాలో మహిళా భక్తులకు చీరల బహూకరణ**

గరిక పూజలో పాల్గొన్న మహిళా భక్తుల కోసం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించారు. డ్రాలో విజేతలైన ఇద్దరు మహిళా భక్తులకు మిట్టపల్లి దుర్గా సునీత చీరలను బహూకరించారు. ఈ చీరలను శ్రీ రాఘవేంద్ర క్లాత్ స్టోర్స్, లక్ష్మీనగర్‌లోని సిటీ స్టైల్ షోరూం యాజమాన్యాలు స్పాన్సర్‌గా అందజేశారు.

**50 ఏళ్లుగా భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రులు**

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొరివి టెంపుల్, హన్మకొండలోని మెట్పల్లి దేవాలయాల ఈవో సత్యనారాయణ హాజరై గణపతి నాధుని ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు చలవాది ప్రకాష్ మాట్లాడుతూ.. సుమారు 50 సంవత్సరాల క్రితం ప్రారంభమైన గణపతి నవరాత్రి ఉత్సవాలను నేటికీ భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గూడెపు శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు పెండ్యాల రోజాలక్ష్మి, చలవాది రాజ్యలక్ష్మి, గుబ్బ దుర్గ, వంకదార ఇందిరా, తాటిపల్లి దీప్తి, కంటాల భారతి, కొప్పారపు సౌజన్య, పసుమర్తి శాంతి, కమిటీ సభ్యులు, మహిళా భక్తులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం

- అమరవీరుల త్యాగాలతో నూతన చరిత్రను నిర్మిద్దాం
- సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

**పాల్వంచ, సెప్టెంబర్ 16, ప్రజాజ్యోతి:** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ, అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో నూతన చరిత్రను నిర్మించాలని సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పాల్వంచ పట్టణంలోని నవల భారత్ బస్తీలో సీపీఎం కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

**రైతాంగ పోరాట చరిత్రను ప్రజలకు తెలియజేయాలి...** ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 1946 నుంచి 1951 వరకు కొనసాగిందని తెలిపారు. ఈ పోరాటంలో సుమారు 4 వేల మంది కమ్యూనిస్టు కార్యకర్తలు, సంఘం సభ్యులు అమరులయ్యారని పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ వంటి మహోన్నత పోరాట యోధుల త్యాగాలతో తెలంగాణ చరిత్ర నిర్మితమైందన్నారు.నైజాం పాలనలో రైతులు, సామాన్య ప్రజలు ఎదుర్కొన్న అణచివేతకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి రైతాంగ ఉద్యమాన్ని నిర్మించారని ఆయన అన్నారు. తెలంగాణ ప్రాంతంలో నైజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

**భూమి కోసం సాగిన పోరాటం ....** దున్నేవాడికే భూమి దక్కాలనే నినాదంతో రైతాంగ హక్కుల కోసం పోరాటం సాగిందని మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు ఉద్యమానికి ఉందని ఆయన పేర్కొన్నారు.

**చరిత్ర వక్రీకరణను అడ్డుకోవాలి ...** నేటి బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నాయని మచ్చా వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ పోరాటాన్ని హిందువులు, ముస్లింల మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించడం ద్వారా ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను ప్రజలకు వివరించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో గ్రామాలు, బస్తీలలో వార్షికోత్సవ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని, సీపీఎం నిర్వహించే ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ రవికుమార్, పట్టణ కార్యదర్శి పోదుల తులసీరామ్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కే. సత్య, పట్టణ కమిటీ సభ్యులు బి. కాంతి, బి. మాధవి, శాఖ కార్యదర్శి బి. సత్యమ్మ, ఇందిర, అరుణ, లక్ష్మీకుమారి, పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.



# అశ్వారావుపేట రక్షణసేన పగ్గాలు సోడెం వెంకట్‌కు నియోజకవర్గ ఇన్చార్జ్ గా నియామకం

- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం



**దమ్మపేట, సెప్టెంబరు. 16(ప్రజాజ్యోతి ):** తెలంగాణ రక్షణసేన పార్టీ నియోజకవర్గాల వారీగా ఇన్చార్జ్ లను నియమించింది. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా బాధ్యతలు అప్పగిస్తూ ఇన్చార్జ్ ల జాబితాను ప్రకటించారు. ఇందులో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ గా సోడెం వెంకట్‌ను నియమించారు.నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడం, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం వంటి బాధ్యతలను సోడెం వెంకట్ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా సోడెం వెంకట్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ గా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ తెలంగాణ రక్షణసేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ తెలంగాణ రక్షణసేన ఆశయాలు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.సోడెం వెంకట్‌ను అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ గా నియమించడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు మరింత విస్తృతమవుతాయని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

# క్షుద్రపూజల బెదిరింపే హత్యకు కారణం

- జల్లేరు వాగు హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- కత్తి స్వాధీనం



**ఇల్లందు, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)** క్షుద్రపూజల బెదిరింపే హత్యకు కారణమని, ఆళ్లపల్లి మండలం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మర్కోడు గ్రామ శివారులో జల్లేరు వాగు వద్ద ఈ నెల 11న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. సుద్దరేవు గ్రామానికి చెందిన కొమరం రామనాథం (59)ను నిందితుడిగా అరెస్ట్ చేసినట్లు ఇల్లెందు డీఎస్పీ యు వెంకన్న బాబు తెలిపారు. నిందితుడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం టేకులపల్లి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి మాట్లాడుతూ మృతుడు పూనెం నారాయణ కొంతకాలంగా రామనాథం ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయ పనుల్లో సహాయపడేవాడని, మద్యం సేవించే అలవాటు ఉండటంతో కుటుంబ సభ్యులతో తరచూ గొడవలు జరిగేవని తెలిపారు. ఈనెల 11న రాత్రి మద్యం సేవించి రామనాథం ఇంటికి వచ్చి గొడవపడటంతో అతడిని ఇంటి నుంచి బయటకు పంపించారని పేర్కొన్నారు. అనంతరం రామనాథం మనవరాలిని క్షుద్రపూజలు చేసి చంపుతానని నారాయణ బెదిరించినట్లు తెలిపారన్నారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన రామనాథం ఇంట్లో ఉన్న కత్తిని తీసుకుని జల్లేరు వాగు వద్దకు వెళ్లాడని, రాత్రి సుమారు 11 గంటల సమయంలో అక్కడ నారాయణ పూజలు చేస్తున్న సమయంలో అతడితో గొడవపడి కత్తితో దాడి చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. దింతో నారాయణ అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని అక్కడే వదిలి రామనాథం తిరిగి వెళ్లిపోయాడని, హత్యకు ఉపయోగించిన కత్తిని సంఘటనా స్థలానికి దక్షిణంగా సుమారు 20 మీటర్ల దూరంలోని పొదల్లో పడేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచుల సమక్షంలో పొదల్లో ఉన్న కత్తిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, కేసుకు సంబంధించిన ఇతర సాక్ష్యాలు, శాస్త్రీయ ఆధారాల సేకరణ కొనసాగుతుందని, దర్యాప్తు అనంతరం చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కేసును త్వరితగతిన ఛేదించేందుకు కృషి చేసిన టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఆళ్లపల్లి ఎస్ఐ సోమేశ్వర్, టేకులపల్లి ఎస్ఐ తిరుపతి, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## పాల్వంచ అయ్యప్పస్వామి దేవాలయంలో నిర్వహణ వేలం పాటలు

- వేలం పాటల్లో పాల్గొన్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు
- అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ చైర్మన్





**పాల్వంచ, సెప్టెంబర్ 16, ప్రజాజ్యోతి:** పాల్వంచ శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప సీజన్ సందర్భంగా నిర్వహించనున్న వివిధ కార్యకలాపాలకు సంబంధించి వేలం పాటలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో పూజా సామగ్రి దుకాణం నిర్వహణకు రూ.2 లక్షలు, టీ కొట్టు నిర్వహణకు రూ.1 లక్షకు వేలం పాటలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి వేలం పాటల నిర్వహణను పరిశీలించారు.

**అన్నదాన కార్యక్రమం ప్రారంభం....**

దేవాలయంలో ప్రతి బుధవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని కొత్వాల శ్రీనివాసరావు ప్రారంభించారు. భక్తులకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ సభ్యులు బందెల శ్రీనివాస్, మేడిద సంతోష్ గౌడ్, మిరియాల కమలాకర్, కనగాల రాంబాబు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సుజాతనగర్ శాఖ ఆధ్వర్యంలో ఘన సన్మానం



**సుజాతనగర్, సెప్టెంబర్ 16, ప్రజా జ్యోతి:** –సుజాతనగర్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం మేయర్ మూడు గణేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల రాములు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు భూక్యా రాజేష్ నాయక్, ఏఎంసీ ఉకే నాగేశ్వరరావులను సుజాతనగర్ శాఖ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సెక్రటరీ బోడ్డు కేశవ రావు ఆధ్వర్యంలో నాయకులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, కార్మికులు మరియు సామాన్య ప్రజల సంక్షేమం కోసం మరింతగా కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుజాతనగర్ శాఖ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల ఐరన్ జనరల్ స్టోర్ లో సెంట్రల్ జీఎస్టీ అధికారులు దాడులు




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 16, (ప్రజా జ్యోతి)** పాల్వంచ పట్టణంలోని దమ్మపేట సెంటర్ లో గల శ్రీ తిరుమల ఐరన్ అండ్ జనరల్ స్టోర్స్ పై హైదరాబాద్ సెంట్రల్ జిఎస్టి విజిలెన్స్, యాంటీ ఎవేషన్ బృందం బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించారు, సదరు షాపు యజమాని పన్ను ఎగవేత, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై జీఎస్టీ బృందం షాపుతో పాటు యజమాని ఇంట్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు, అధికారుల తనిఖీల నేపథ్యంలో ఫరార్ అయిన షాప్ యజమాని. పూర్తిస్థాయి విచారణ అనంతరం వివరాలు మీడియాకు వెల్లడిస్తామని తెలిపిన జిఎస్టి అధికారులు.

## గణపతి మండపాల్లో అన్నదానం

- అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఇల్లెందు సీఐ తాటిపాముల సురేష్






**ఇల్లెందు, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)** పట్టణంలోని పలు వార్డుల్లో గణపతి మండపాల్లో అన్నదాన కార్యక్రమాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతికి ప్రత్యేక పూజలను నిర్వహించి గణపతి ఆశీస్సులను పొందారు. పట్టణంలోని 19వ వార్డు సిక్కుల బజార్ లో అన్నదాన కార్యక్రమాన్ని ఇల్లెందు సీఐ తాటిపాముల సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ప్రథమ పూజలను అందుకునే వినాయకుడికి భక్తులందరూ నిష్ఠతో పూజలను నిర్వహిస్తే ఆ విఘ్నేశ్వరుడు అన్ని విఘ్నాలను తొలగించి ఆశీస్సులను అందిస్తాడని పేర్కొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు సిఐ తాటిపాముల సురేష్‌ను శాలువాతో సన్మానించారు. అన్నదాన కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏ టు జెడ్ శ్రీను, ఆవుల భాస్కర్ రావు, అయిత సత్యం, అంజి, మంగల్. వైభవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం

- వివాహానికి నిరాకరించి బెదిరింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదు
- వ్యక్తిపై కేసు నమోదు
- పాల్వంచ టౌన్ పోలీసుల దర్యాప్తు

**పాల్వంచ, సెప్టెంబర్ 16, ప్రజాజ్యోతి:** వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం ఏర్పరచుకుని, అనంతరం వివాహానికి నిరాకరించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డాడనే ఫిర్యాదు మేరకు ఓ వ్యక్తిపై పాల్వంచ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ టౌన్‌కు చెందిన 25 ఏళ్ల బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుర్సం శ్రీరాములు అలియాస్ నానిపై కేసు నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చదువుతున్న సమయంలో నిందితుడు ఆమెకు పరిచయమయ్యాడు. తనను ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం ఏర్పరచుకున్నట్లు ఆమె ఆరోపించింది. అనంతరం తన స్వగ్రామమైన బొజ్జలగూడలోని ఇంటికి తీసుకెళ్లి సుమారు రెండేళ్ల పాటు తనతో కలిసి ఉంచుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ఇటీవల వివాహం గురించి ప్రశ్నించగా వివాహం చేసుకోనని చెప్పడంతో పాటు, బాధితురాలు, ఆమె తల్లిదండ్రులను అసభ్యకరమైన పదజాలంతో దూషించాడని ఆరోపించింది. వివాహం విషయమై తనను సంప్రదించినా, తన ఇంటికి వచ్చినా చంపుతానని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.